సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం : 26 : జూన్ : 2024



దానిమ్మ.. లాభాల కొమ్మ

దానిమ్మ సాగులో అధిక దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. - 8లో



కాపురం చేద్దామంటే కడతేర్చాడు

జరిగిందేదో జరిగిపోయింది కలిసి కాపురం చేద్దామని వేడుకున్న భార్యను భర్తే కడతేర్చిన ఘటన బి.కొత్తకోట మండలంలో సోమవారం రాత్రి జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.500	రూ.600
రెండోరకం	రూ.400	రూ.460



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 971 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	480
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 625 కిలోలు

న్యూస్‌రీల్

నేడు రవాణాశాఖ మంత్రి రాక

రాయచోటి: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈనెల 26న బుధవారం జిల్లా కేంద్రం రాయచోటికి రానున్నట్లు జిల్లా కలెక్టర్ యం. అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. 26న మంత్రి సాయంత్రం 4.10 గంటలకు కుప్పం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 6.10 గంటలకు రాయచోటి జిల్లా కేంద్రం చేరుకుని క్యాంపు కార్యాలయంలో బస చేస్తారన్నారు. అనంతరం నిర్ణయించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ కోర్సులు ప్రారంభం

రాయచోటి టౌన్: రాయచోటి పాలిటెక్నిక్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ కోర్సులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు జులై మొదటి వారం నుంచి ప్రారంభిస్తామన్నారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

ట్రైనర్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

జూనియర్ సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ పొందేందుకు వచ్చేవారికి శిక్షణ ఇచ్చేందుకు బీటెక్ కంప్యూటర్స్ సైన్స్ లేదా ఎంసీఏ చదివిన అభ్యర్థులు ట్రైనర్స్‌గా పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీరికి నెలకు వేతనం రూ.20,000 చెల్లిస్తామన్నారు. సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు నేరుగా కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న ట్రైనీ ఐఏఎస్‌లు



ఆలయ రంగమండపంలో సేదతీరిన ట్రైనీ ఐఏఎస్‌లు

ఒంటిమిట్ట: ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయాన్ని మంగళవారం సాయంత్రం ఏపీ క్యాడర్‌కు చెందిన 2023 ఐఏఎస్ ట్రైనింగ్ ఆఫీసర్లు ఆరుగురు దర్శించుకున్నారు. వీరిలో సీహెచ్ కల్యాణి, దామెర హిమవంశీ, తావర్ స్వప్నిల్ జగన్నాథ్, బి.వినూత్న, హెచ్‌ఎస్ భావన, శుభమ్ నూక్వాల్‌లకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ గావించి గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరు ఆలయ రంగమండపంలో సేదతీరి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అభ్యర్థులందరూ వ్యయ రిజిస్టర్లను సమర్పించాలి

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు – 2024లో పోటీచేసిన అభ్యర్థులందరూ వారి తుది వ్యయ రిజిస్టర్లను తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధులతో అభ్యర్థుల తుది వ్యయ రిజిస్టర్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తుది వ్యయ రిజిస్టర్లను ఏ విధంగా సమర్పించాలో వివరించారు. ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల వ్యయ పరిశీలకులు అన్నమయ్య జిల్లాకు రానున్న నేపథ్యంలో అభ్యర్థులు వారి తుది వ్యయ రిజిస్టర్లను ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమర్పించి సంబంధిత సర్టిఫికెట్లను పొందాలని తెలిపారు.

రైతాంగ సమస్యలపై రేపు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

రాయచోటి అర్బన్: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27వ తేదీన రాష్ట్రవ్యాప్త ఆందోళనలను నిర్వహించనున్నట్లు ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన సాగుసాయం రైతుకు రూ.20వేలు చొప్పున ఈ ఖరీఫ్ సీజన్‌లో అందజేయాలన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచి పంటరుణాలు వడ్డీలేకుండా రూ. 3లక్షల వరకు అందివ్వాలన్నారు. కౌలురైతులకు వెంటనే గుర్తింపు కార్డులను ఇవ్వడంతో పాటు వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టుల కింద ఉన్న మేజర్, మైనర్ కాలువలకు మరమ్మతులు చేపట్టి రైతాంగానికి సాగునీరందించాలన్నారు. రైతాంగానికి ఉరితాళ్లుగా మారిన స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దుచేయాలన్నారు. రైతులకు పంటల సాగుకు అవసరమైన విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరారు. ఇలాంటి పలు డిమాండ్ల సాధనకు ఈనెల 27న రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

అన్నమయ్యా.. మోక్షమెప్పుడయ్యా!

- ప్రాజెక్టు రూపు రేఖల మార్పుపై చర్చ
- సీడబ్ల్యూసీ చెంతకు చేరిన రెండు డిజైన్లు
- కాంక్రీట్.. రాక్‌ఫిల్.. ఏదో ఒక డిజైన్‌కు ఆమోదం!
- పూణే వెళ్లి పరిశీలించిన సీడీఓ అధికారులు

రాజంపేట: అన్నమయ్య జలాశయం పునర్ నిర్మాణం డిజైన్ మారనుందా.. అంటే.. అవుననే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముందుగా కాంక్రీట్ డ్యాం నిర్మించాలనుకున్నారు. ఇప్పుడు రాక్‌ఫిల్ డ్యాం నిర్మించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా ఎంతటి వరద వచ్చినా తట్టుకునేలా డ్యాం పునర్ నిర్మాణం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్ణయం తీసుకొని అధునాతనమైన డిజైన్‌ను తీసుకొచ్చారు.

3.2 లక్షల క్యూసెక్కుల వరద నీటితో...

2021 నవంబరు 19న శుక్రవారం అన్నమయ్య జలాశయంలో ఉదయం 5.30 గంటలకు 3.2 లక్షల క్యూసెక్కుల వరదనీటి ఉధృతితో బండ్ తెగిపోయింది. చెయ్యేటిలోకి పెద్ద ఎత్తున ఉధృతంగా వరద బీభత్సం సృష్టించింది. నదీ పరివాహక పల్లెలను ముంచెత్తిన సంఘటన పునరావృతం కాకుండా గత ప్రభుత్వం పటిష్టమైన చర్యలకు దిగింది. ఇందులో భాగంగా జలాశయం పునర్ నిర్మాణంలో భాగంగా స్పిల్‌వే సామర్థ్యం పెంచుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు. 2.242 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఉన్న జలాశయం రూపురేఖలు మార్చారు.

8లక్షల 22వేల క్యూసెక్కుల సామర్థ్యం..

జలాశయాన్ని 8లక్షల 22వేల క్యూసెక్కుల నీటి విడుదల చేసే సామర్థ్యం కలిగే డిజైన్ రూపొందించనున్నారు. ఇప్పటికే హైడ్రాలజీ అధ్యయనం పూర్తి చేసుకున్న అనంతరం నిర్ణయం తీసుకున్నారు. వరద నీటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర జలవనరుల సంఘం సిఫార్సు చేసింది. ఆ మేరకు సామర్థ్యంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఎంతటి ఉపద్రవం వచ్చినా తట్టుకునేలా జలాశయం నిర్మాణానికి రూపకల్పన ముమ్మరంగా జరిగింది. ఇందుకోసం వివిధ రకాల భూగర్భ పరీక్షలు, హైడ్రాలజీ అధ్యయనాలు జలాశయంలో కొనసాగాయి.



అన్నమయ్య డ్యాం తెగిన ప్రాంతం (ఫైల్)

గత వరద ఉధృతి పరిశీలించాకే..

అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం తర్వాత 50 సంవత్సరాల తర్వాత అన్నమయ్య ప్రాజెక్టు 2021లోనే తొలిసారిగా భారీ వరద పోటును తట్టుకోలేకపోయింది. గతంలో మూడు సార్లు జరిగిన ఘటనలు, 16 యేళ్లలో మూడు సార్లు భారీగా వరదలు రావడం , ప్రతిసారి సామర్థ్యానికి మించి నీటిని విడుదల చేసిన లెక్కలను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం పరిశీలించిన సంగతి తెలిసిందే.

ఇప్పటి ప్రభుత్వంలో తెరపైకి వచ్చిన రాక్‌ఫిల్ డ్యాం..

ఆసియా ఖండంలోనే రెండు గ్యాలరీలతో నిర్మితమైన అన్నమయ్య జలాశయం పునర్ నిర్మాణ పనులు మార్చుకునే దిశగా అడుగులు పడ్డాయి. నదీ గర్భంలో 40 మీటర్ల వరకు ఇసుక ఉన్న నేపథ్యంలో కాంక్రీట్ డ్యాం తట్టుకుంటుందా అన్న సందేహాలను ఇరిగేషన్ వర్గాలలో అనుమానాలు రేకెత్తించాయి. ఫలితంగా డ్యాం పునర్ నిర్మాణంలో భాగంగా రెండు డిజైన్లను పరిశీలన నిమిత్తం ప్రభుత్వానికి పంపారు.

ప్రాజెక్టుల సమీక్షలో అన్నమయ్య అంశం..

రాష్ట్ర ప్రభుత్వం గత గురువారం ప్రాజెక్టుల సమీక్షలో అన్నమయ్య జలాశయం పునర్ నిర్మాణం అంశంపై చర్చించింది. ఈ డ్యాం నిర్మాణ విషయంలో గత సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన అంశాల గురించి అధికారులతో ప్రస్తావించారు. ఇందులో భాగంగా కాంక్రీట్ డ్యాం వరకు తీసుకుంటే 21 గేట్లు వస్తాయి. కొత్తగా తెరపైకి వచ్చిన డిజైన్ రాక్‌ఫిల్ డ్యాం అయితే, అదనంగా స్పిల్‌వే నిర్మించి 9 గేట్లను ఏర్పాటు చేసే దిశగా డిజైన్లు రూపొందించారు.

గత టీడీపీ పాలనలో అదనపు స్పిల్‌వే నిర్మించకపోవడంతోనే..

చెయ్యేరు నదిపై 2.24 టీఎంసీల సామర్థ్యంతోనే అన్నమయ్య ప్రాజెక్టును 1981లో ప్రారంభించగా, 2001లో పూర్తి చేశారు. 206.65 మీటర్ల ఎత్తుతో 94 మీటర్ల పొడవు స్పిల్‌వే , అనుబంధంగా 336 మీటర్ల పొడవు మట్టికట్టను నిర్మించారు. స్పిల్‌వేకు 13.75 మీటర్ల పొడవున మట్టికట్టను నిర్మించారు. స్పిల్‌వేకు 13.75 మీటర్ల ఎత్తు, 14 మీటర్ల వెడల్పుతో ఐదు గేట్లు అమర్చారు. ఈ ప్రాజెక్టు కింద 22.500 ఎకరాల ఆయకట్టు ఉంది. 2012లో జలవనరుల శాఖ 3–డీ అధ్యయనంలో అన్నమయ్య డ్యాం స్పిల్‌వే నుంచి గరిష్టంగా 2.17 లక్షల క్యూసెక్కులే దిగువకు విడుదల చేయవచ్చని తెలిపింది. 2017లో ప్రాజెక్టును తనిఖీ చేసిన డ్యామ్ సేఫ్టీ కమిటీ 1.30 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేసేలా అదనంగా మరో స్పిల్‌వే నిర్మించాలని ఇచ్చిన నివేదికను అప్పటి టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. ఫలితంగా నాలుగేళ్ల క్రితం వచ్చిన భారీ వరదతో మట్టికట్ట కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే.



అన్నమయ్య జలాశయం (ఫైల్)

గేట్ల సంఖ్య పెరిగే అవకాశాలు

ప్రస్తుతం జలాశయంలో ఐదుగేట్లు ఉన్నాయి. స్పిల్‌వే సామర్థ్యం 8లక్షల 22వేల క్యూసెక్కులు పెంచుకున్న నేపథ్యంలో గేట్ల సంఖ్య కూడా పెరిగే పరిస్థితులు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం 1 లక్ష 80వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే సామర్థ్యం కలిగి ఉంది. డ్యాం వరద బీభత్సంతో మట్టికట్ట తెగిపోయిన తరుణంలో కాంక్రీట్‌డ్యాం నిర్మాణం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జలాశయం నిర్మాణానికి సంబంధించి టెండర్లు పూర్తి చేసింది. రూ.635 కోట్లతో హైదరాబాదుకు చెందిన రాఘవ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. జలవనరుల శాఖతో ఒప్పందం చేసుకున్న నిర్మాణ సంస్థ భూగర్భ పరిశీలన పరీక్షలు, యంత్రాలతో డ్రిల్లింగ్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో డ్యాం పునర్ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు డిజైన్‌పై నిర్ణయం వెలువడిన తర్వాతే డ్యాం పనులు చేపడతామనే భావనను నిర్మాణ సంస్థ జలవనరుల శాఖకు తెలియజేసినట్లు సమాచారం.

సీడబ్ల్యుసీ చెంతకు..

సీడబ్ల్యుసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) చెంతకు రెండు డిజైన్లు చేరుకున్నాయి. జలవనరుల శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌యాదవ్, కడప ఎస్‌ఈ శ్రీనివాస్, రాజంపేట ఈఈ రవికిరణ్‌లు సీడబ్ల్యుసీ, పూణెలో సెంట్రల్ వాటర్ రిసోర్సెస్ పవర్ స్టేషన్‌లకు వెళ్లి పరిశీలించి వచ్చారు. డ్యాం రక్షణ దృష్ట్యా ఏ డిజైన్ అనుకూలంగా ఉంటుందో అనేది త్వరలోనే సీడబ్ల్యుసీ వెల్లడించనుంది. నదీ గర్భంలో ఇసుక 40 మీటర్ల మేర లోతు వరకు ఉండటంతో రెండు డిజైన్‌లలో ఏ డిజైన్‌కు సీడబ్ల్యుసీ మొగ్గు చూపుతుందో వేచి చూడాల్సిందే. డ్యాం పునర్ నిర్మాణానికి సంబంధించి రెండు డిజైన్లు సీడబ్ల్యుసీ పరిశీలనకు వెళ్లాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

డీఎస్సీకి సన్నద్ధం

- టెట్ ఫలితాల విడుదలతో అభ్యర్థుల్లో ఉత్సాహం
- ఉత్తీర్ణత సాధించని వారికి మరో ఛాన్స్

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రా సివిల్స్‌గా పేరొందిన ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీ–2024 నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర కేబినెట్ 16,347 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అభ్యర్థుల్లో సంతోషం నెలకొంది. గత ప్రభుత్వం నిర్వహించిన టెట్ ఫలితాలు మంగళవారం విడుదల కావడంతో అభ్యర్థులు డీఎస్సీకి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికీ అర్హత సాధించని వారికోసం మరోసారి జూలై 1న టెట్ నిర్వహించనున్నారు. అదే రోజున డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయనుంది. దీంతో అభ్యర్థులు కోచింగ్ నిమిత్తం అవనిగడ్డ, కర్నూలు, కడప తదితర ప్రాంతాలకు పయనమయ్యారు.

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో 1154 ఖాళీలు

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో వివిధ ఉపాధ్యాయ కేటగిరీలకు సంబంధించిన 1154 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యా శాఖ వర్గాల సమాచారం. అయితే జిల్లాలో 709 పోస్టుల భర్తీ అంటూ వివిధ మాధ్యమాల్లో సమాచారం వస్తుండగా, అధికారులు మాత్రం నోటిఫికేషన్ వరకు ఖాళీల సమాచారం ప్రకటించలేమని చెబుతుండటం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ఈ పోస్టులకు దాదాపు 30 వేలమంది అభ్యర్థులు పోటీపడే అవకాశం ఉంది. ఈ ఏడాది మే నెల నాటికి ఉన్న ఖాళీలను నోటిఫికేషన్‌లో చూపించనున్నారు.



ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో ఖాళీలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు : 65

జిల్లా పరిషత్ : 1011

మున్సిపాలిటీ : 78

మొత్తం: 1154



కేసుల్లో పురోగతి సాధించాలి

నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పురోగతి సాధించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసులలోని నిందితులకు తగిన శిక్షపడేలా కృషి చేయాలన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో పలు కేసులు, గ్రేవ్ కేసులు, పీడీ యాక్ట్ ఇతర అంశాలపై సమీక్షించారు.

చట్టాలపై అవగాహన అవసరం

పోలీసులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ సూచించారు. కొత్త చట్టాలపై భారతీయ న్యాయ సంస్థ, భారతీయ నాగరిక సురక్ష సమితి వంటి వాటిపై పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. హత్య, రేప్, పోక్సో, ప్రాపర్టీ, గంజాయి తదితర గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు, ముద్దాయిల అరెస్టుపై సర్కిల్ వారీగా పోలీసు అధికారులను ఆరా తీశారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని చెప్పారు. తరచుగా దొంగతనాలు, దారిదోపిడీలు, చైన్‌స్నాచింగ్ వంటి నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత ఎస్‌డీపీఓలు ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను పెంచి నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. వాహన తనిఖీలు చేపట్టి చలానాలు విధిస్తూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. నేర సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్‌కమల్, డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

ఉద్యాన సాగుకు.. ఉపాధి ఊతం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) మొక్కల పెంపకంపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రకృతిలో చెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ భర్తీ పూడ్చేందుకు రాబోయే రోజుల్లో మొక్కల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేసి ఉద్యాన సాగుతో రైతులకు ఉపాధి కల్పించడంపై డ్వామా శ్రద్ధ పెడుతోంది. అర్హత ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది.

- రాయితీలతో ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- 7వేల ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు ప్రణాళిక
- కాల్వలు, రోడ్ల పొడవునా మొక్కల పెంపకం
- ఉపాధి హామీ పథకం కింద రైతులకు సాయం

కడప సిటీ: ఈ ఆర్థిక సంవత్సరంలో ఏడు వేల ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని డ్వామా లక్ష్యంగా పెట్టుకుంది. క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ఈ ఏడాది పండ్ల తోటల సాగు మరింత విస్తరించేదుకు భారీ ప్రణాళికలు రూపొందించింది. పండ్ల తోటలు, కూరగాయల సాగు, నీటి కుంటలు, ఉద్యాన యాంత్రీకరణ, మల్చింగ్ తదితర పథకాల కింద రాయితీలు ప్రకటించింది. ఉపాధి హామీ పథకం కింద కేవలం కూలీలకు పనులు కల్పించడమేగాక, వారి సుస్థిర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టనుంది. అందులో భాగంగా చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న మామిడి, చీనీ, సన్న నిమ్మ,జామ, సపోట, డ్రాగన్ ఫ్రూట్, తదితర 13 రకాల పండ్ల తోటలు పండించేందుకు వంద శాతం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. కొన్ని పంటలకు మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది.

ఏడు వేల ఎకరాలు లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద ఏడు వేల ఎకరాల్లో మొక్కలు నాటాలన్నదే డ్వామా ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టేందుకు లబ్ధిదారులను గుర్తించారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలు ఉండడంతో రైతులు ఈ పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం అర్హులైన రైతులకు రాయితీ ఇస్తూ చేయూత అందిస్తోంది. జిల్లాలో పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం పరిధిలోని మండలాల్లో చీనీ, సన్న నిమ్మ ప్లాంటేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చి.. మిగిలిన మండలాల్లో మామిడి, చీనీ, సన్న నిమ్మ, తైవాన్ జామ, నాటు జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరెడు, ఆపిల్ బేర్‌తోపాటు డ్రాగన్ ఫ్రూట్‌కు కూడా ప్రోత్సాహం అందిస్తోంది. రాయితీ కింద మూడేళ్లపాటు నిర్వహణ ఛార్జీలతోపాటు ఎరువులు, పురుగుల మందులు, దుక్కులు, అంతర్ పంట మొక్కలు, గుంతలు కలిపి సగటున ఎకరాకు మూడు సంవత్సరాలకు రూ.లక్ష వరకు ప్రోత్సాహం అందిస్తోంది. మరోవైపు మునగ సాగుపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. అర్హులైన రైతులు మునగ మొక్కలు నాటితే ప్రోత్సాహం అందిస్తోంది.

బోరు బావి లేకున్నా...

మెట్ట భూముల్లో (డ్రై ల్యాండ్) హార్టికల్చర్‌లో భాగంగా చీనీ మినహాయించి మిగిలిన పండ్ల తోటలకు రైతుకు బోరు లేదా బావి లేనప్పటికీ హార్టికల్చర్‌లో లబ్ధి పొందే అవకాశం ఉంది. నీటి వసతి లేని రైతులకు నీళ్ల ట్యాంకుల ద్వారా సరఫరా చేసుకునేందుకు ఉపాధి హామీ ద్వారా ఆర్థిక సాయం అందించనుంది.



ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన దానిమ్మ తోటలో రైతు

దరఖాస్తు చేసుకోవాల్సింది ఇలా..

అర్హులైన రైతులు జూన్ చివరి వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం నకలు, ఒరిజినల్ 1బీ, ఉపాధి హామీ జాబ్‌కార్డు నకలు, జాబ్‌కార్డులో ఉన్న వారందరి ఆధార్ నకలు, చిన్న, సన్నకారు రైతుల పత్రం, దరఖాస్తు పత్రం అందజేయాల్సి ఉంటుంది. అర్హులు, ఆసక్తిగల రైతులు మండల అభివృద్ధి అధికారి లేదా మండల ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓ లేదా గ్రామ ఉపాధి హామి క్షేత్ర సహాయకులను(ఎఫ్ఏ) సంప్రదించవచ్చు.

పక్కాగా నిత్యావసర వస్తువుల పంపిణీ

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



రాయచోటి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులు పక్కాగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్‌ల నుంచి రేషన్ షాపులకు సరుకు రవాణా వేగవంతంగా పూర్తి చేసి జులై 1వ తేదీ నుంచి సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. రేషన్ షాప్ డీలర్లు ఖాళీగా ఉన్నట్లయితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకుని సరుకులు పంపిణీ చేపట్టాలన్నారు. ఎండీయూ వాహనాల డ్రైవర్లు,ఆపరేటర్ పోస్టులు ఖాళీలు ఉన్నట్లయితే ఇవి కూడా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైనందున అవసరమైన విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీ పెండింగ్ లేకుండా వెంటనే జారీ చేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అమలు చేస్తున్న సేవలను వేగవంతం చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. డీఎస్ఓ రఘురాం, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ నేతలపై కేసు నమోదు

గుర్రంకొండ : ఈనెల 24న పోలీస్‌స్టేషన్‌లో పోలీసులపై దాడికి పాల్పడ్డ టీడీపీ నాయకులపై కేసునమోదు చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ అన్నారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అమిలేపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రెడ్డిప్రకాష్, విద్యాసాగర్, వెంకటేశ్వర, మహేందర్‌రెడ్డి, రామకృష్ణ, ద్వారకనాథ్‌లు గత సోమవారం సాయంకాలం స్టేషన్ వద్దకు చేరుకొన్నారు. అక్కడే ఓ కేసు విషయమై వేచి ఉన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులను దూషిస్తూ పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకెళ్లారు. అడ్డుకోబోయిన ఎస్‌ఐ శ్రీనివాస్‌నాయక్, మరో హెడ్ కానిస్టేబుల్‌ను తోసేశారు. ఈనేపథ్యంలో వారిపై సెక్షన్లు 353, ఎస్సీ,ఎస్టీ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన అచ్చన్న

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై నారాయణ రెడ్డిగారి పల్లె సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనం ఢీ కొని అచ్చన్న అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... నారాయణ రెడ్డిపల్లి కస్బాకు చెందిన అచ్చన్న సొంత పనుల నిమిత్తం సమీపంలోని ఓ హోటల్ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా రాయచోటివైపు నుంచి సంబేపల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో అచ్చన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కుక్కల దాడిలో 13 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ వడ్డిపల్లి సమీపంలో మంగళవారం కుక్కలు స్వైర విహారం చేశాయి. ఇదే గ్రామానికి చెందిన రామేశ్వరం బాబు అనే రైతు సమీప బీడు భూముల్లో గొర్రెలు మేపుతుండగా ఒక్కసారిగా 20 కుక్కలు మూకుమ్మడిగా గొర్రెలపై దాడి చేశాయి. ఈ ఘటనలో 13 గొర్రెలు మృతి చెందగా.. మరో 9 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గాయపడిన గొర్రెలకు కందుకూరు పశు వైద్య సిబ్బంది చికిత్స అందించారు. ఈ ఘటనలో రైతుకు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

దానిమ్మ.. లాభాల కొమ్మ

- దానిమ్మలో అధిక దిగుబడి
- ఫలితాన్నిచ్చిన నియంత్రకాల వినియోగం
- దోహదపడిన నీరు, ఎరువుల యాజమాన్యం


నరసింహారెడ్డి దానిమ్మ తోటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు


నరసింహారెడ్డి తోటలో కాసిన దానిమ్మ కాయలు



మైదుకూరు : దానిమ్మ సాగులో అధిక దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ దానిమ్మ రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ఉద్యాన పంటల్లో మొక్కలు ఎదుగుదల లేకపోవడం, పూత, పిందె రాలిపోవడం, దిగుబడి ఆశించినంత రాకపోవడం వంటి సమస్యలను అధిగమించేందుకు మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వినియోగించిన నియంత్రకాల ప్రయోగం దానిమ్మపంటపై కూడా విజయవంతమైంది. ఇటీవల సుమన్ కుమార్ అనే రైతు సాగు చేసిన నిమ్మ పంటలో నియంత్రకాల వల్ల అధిక దిగుబడి వచ్చేలా కృషి చేసిన కేవీకే శాస్త్రవేత్తలు ఇప్పుడు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి అనే ఇద్దరు రైతులు దానిమ్మ పంటలో అధిక దిగుబడి సాధించేందుకు నియంత్రకాల ప్రయోగంతో చేయూతనిచ్చారు.

బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లెకు చెందిన నరసింహారెడ్డి పది ఎకరాల్లో, పోరుమామిళ్ల మండలం చెన్నారెడ్డి పేటకు చెందిన సుబ్బారెడ్డి అనే రైతు 5 ఎకరాల్లో దానిమ్మ సాగు చేశారు. ఈ తోటలో మొక్కల పెరుగుదల, పూతపై వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నియంత్రకాల ప్రయోగం నిర్వహించారు. మొక్కల పెరుగుదల నియంత్రకాలైన సైకోసిల్, మెట్రో బెంజిన్‌లను వినియోగించారు. ఒక లీటరు నీటిలో సైకోసెల్ 2.0 మిల్లీలీటర్లు కలిపి మొక్కపై పిచికారి చేశారు. ఈ పిచికారికి ముందు ఇథ్రల్ అనే మరో నియంత్రకాన్ని ఒక లీటరు నీటిలో 2.0 మిల్లీలీటర్లు కలిపి దానితోపాటు డీఏపీ 2.0 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారి చేశారు. దాని వల్ల మొక్కల కొమ్మలకున్న ఆకులన్నీ రాలిపోతాయి. దాంతో మొక్కలు ఒత్తిడికి గురై ప్రోలీన్ అనే అమైనో యాసిడ్ మొక్కల్లో వృద్ధి చెందుతుంది. దాని వల్ల మొక్కలు పూత దశకు చేరుకుంటాయి. ఆకులన్నీ రాలిన తర్వాత మొక్కల కొమ్మల కత్తిరింపులు చేయాలి. ఆ తర్వాత బ్లీటాక్స్ 5.0 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. మొక్కల చుట్టూ పాదులు చేసి వేర్లను కత్తిరించాలి. నీరు, ఎరువులు అందించకుండా ఉంటే మొక్కలు ఒత్తిడికి గురవుతాయి. నెల రోజుల తర్వాత దానిమ్మ మొక్కలకు నీటితోపాటు ఎరువులను కూడా అందించాలి. వారం రోజుల తర్వాత మొక్కల శాఖలను బాగా విస్తరించి పెరుగుతాయి. ఈ సమయంలో మొక్కలకు సైకోసిల్ 2.0 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటితో కలిపి, నైట్రోబెంజిన్ 2.0 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి. ఈ మందులు పిచికారి చేసిన 15 రోజుల తర్వాత పూత బాగా వస్తుంది.

పూతకు వచ్చిన మూడు నెలల తర్వాత కాయలు బాగా కాస్తాయి. నీరు, ఎరువుల యాజమాన్యం బాగా చేస్తే ఒక్కో దానిమ్మకాయ 350–500 గ్రాముల వరకు పెరుగుతాయి. ఈ నియంత్రకాల ప్రయోగంతో సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి అనే రైతులు హెక్టారుకు 18 టన్నుల దిగుబడి సాధించడం విశేషం.


దానిమ్మకాయల దిగుబడి

ఆశాజనకంగా దానిమ్మ దిగుబడులు



నియంత్రకాల ప్రయోగంతో సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి అనే రైతులు సాగు చేసిన దానిమ్మ పంటలో దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. మొక్కల ఎదుగుదల లేని పరిస్థితుల్లో ఈ ప్రథమ శ్రేణి ప్రదర్శన నిర్వహించాం. అది ఫలితాన్నిచ్చి రైతులకు లాభసాటి ఆదాయం సమకూరే విధంగా దిగుబడి వచ్చింది. – డాక్టర్ ఎం.బాలకృష్ణ, సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి, కేవీకే, వనిపెంట

నియంత్రకాలు, నీటి యాజమాన్యంతో ప్రయోగం



దానిమ్మ సాగులో మొక్కల ఎదుగుదల, పూత పిందె రాలకుండా ఉండేందుకు నియంత్రకాలతో పాటు కాయల పెరుగుదలకు నీరు, ఎరువుల యాజమాన్యంతో ప్రయోగం చేశాం. ఇది మంచి ఫలితాన్ని ఇచ్చింది. సైకోసిల్, నైట్రోబెంజిన్ నియంత్రకాలను పిచికారి చేయడం వల్ల పూత, పిందె నిలిచి మంచి దిగుబడి వచ్చింది. – డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, వనిపెంట

అధిక దిగుబడితో సంతోషం



నేను సాగు చేసిన దానిమ్మ పంటలో అధిక దిగుబడి సాధించడం సంతోషంగా ఉంది. కేవీకే శాస్త్రవేత్తల నియంత్రకాల ప్రయోగంతో ఇది సాధ్యమైంది. ప్రథమ శ్రేణి ప్రదర్శనను నా పొలంలో నిర్వహించినందుకు కేవీకే అధిపతి డాక్టర్ బాలకృష్ణ, ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్‌లకు ధన్యవాదాలు. – నరసింహారెడ్డి, దానిమ్మ రైతు, లింగాలదిన్నెపల్లె, బి.మఠం మండలం.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని మండల విద్యా శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప జయనగర్‌కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో కడప డివిజన్ పరిధిలోని కడప, ఒంటిమిట్ట, సిద్దవటం మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కడప ఎమ్మార్సీ సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాలలోపు గల పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేందుకు నేను బడికి పోతా కార్యక్రమాన్ని జూన్ 13 నుంచి జులై 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, గ్రామ ఎడ్యుకేషన్ సెక్రెటరీ సహకారంతో సీఆర్పీల ప్రోత్సాహంలో ప్రతి ఒక్క విద్యార్థి బడి బయట ఉండకుండా బడిలో ఉండేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా, మండల క్లస్టర్‌స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప మండల ఎంఈఓలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్, సిద్దవటం ఎంఈఓలు విలియంరాజు, అరుణ, ఒంటిమిట్ట ఎంఈఓలు వెంకట సుబ్బయ్య, ప్రభాకర్, సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి, సీఎంఈ మిట్టా కేశవరెడ్డి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

కలిసి కాపురం చేద్దామంటే కడతేర్చాడు

- మొదటి భార్యను గొంతునులిమి చంపేసిన వైనం
- రెండో భార్య, ఇద్దరు పిల్లల మృతి కేసులో నిందితుడై జైలు నుంచి తిరిగొచ్చాక ఘాతుకం


హత్యకు గురైన అన్నపూర్ణ

బి.కొత్తకోట : జరిగిందేదో జరిగిపోయింది కలిసి కాపురం చేద్దామని వేడుకున్న భార్యను భర్తే కడతేర్చిన ఘటన బి.కొత్తకోట మండలంలోని బి.కొత్తకోట–మదనపల్లె మార్గం జమాలమ్మ దర్గా సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం ఈ ఉదంతం వెలుగు చూడటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలు. బి.కొత్తకోట మండలం పత్రవారిపల్లెకు చెందిన డి.అన్నపూర్ణ (28)కు కర్ణాటకలోని చిక్కబళ్లపూర్ జిల్లా ఎగువకోటకు చెందిన మల్లికార్జున (32)తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు కలిగాడు. తర్వాత ఏమైందో కాని మల్లికార్జున కర్ణాటకకు చెందిన రాధను రెండో వివాహం చేసుకోగా వారికి ముగ్గురు సంతానం కలిగారు. ఇదిలా ఉండగా .. రెండేళ్ల క్రితం అన్నపూర్ణ భర్త మల్లికార్జునను వదిలి పత్రవారిపల్లెలోని పుట్టింటికి వచ్చేసింది. రాధతో మల్లికార్జున కాపురం సజావుగా సాగుతుండగా ఆరు నెలల క్రితం రాధ, తన ముగ్గురు సంతానంలో ఇద్దరితో కలిసి చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో భర్త మల్లికార్జునను నిందితుడిగా చేయడంతో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలులో ఉండిన మల్లికార్జున ఈనెల 18న బెయిలుపై విడుదల అయ్యాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య అన్నపూర్ణ ఉంటున్న పత్రవారిపల్లెకు సోమవారం వచ్చిన మల్లికార్జున ఇకపై కలిసి జీవించడం ఉండదని, ఎవరి జీవితాలు వారు చూసుకోవాలని ఖరాఖండీగా చెప్పేశాడు. ఫోన్‌లో కూడా మాట్లాడవద్దని కోరాడు. దీనికి అన్నపూర్ణ అంగీకరించలేదు. కలిసి జీవిద్దామని పదేపదే ఒత్తిడి చేసినా నిరాకరించాడు. చివరకు అన్నపూర్ణను బైక్‌పై తీసుకుని కర్ణాటకలోని తన స్వగ్రామం ఎగువకోటకు తీసుకెళ్లాడు. అక్కడ మళ్లీ ఏమి జరిగిందో కాని తిరిగి బైక్‌పై అన్నపూర్ణతో కలిసి పత్రవారిపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలో కొండకిందపల్లె సమీపంలోని జమాలమ్మ దర్గా వద్ద బైక్ నిలిపి మాట్లాడుకుందామని రోడ్డుకు కొంతదూరంలో అన్నపూర్ణను తీసుకుని వెళ్లాడు. రెండో భార్య రాధ, ఇద్దరు పిల్లల మృతికి అన్నపూర్ణే కారణమని మల్లికార్జున భావించేవాడు. ఈ కారణంతోపాటు, కలిసి జీవిద్దామని ఒత్తిడి చేయడం తో అసహనానికి గురయ్యాడు. ఎప్పుడూ చనిపోయిన పిల్లలే గుర్తుకు వస్తుంటారని ఆవేదనకు గురయ్యేవాడు. దీనితో అక్కడ కొంతసేపు మాట్లాడాక అన్నపూర్ణను గొంతు నులిమి చంపేశాడు. మృతదేహాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. అందిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలం చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు



ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన పూజారి రామప్ప


ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడిన రియాజ్

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మండలం వలస పల్లెకు చెందిన రెడ్డి బాష కుమారుడు కె. రియాజ్ (23), అతని స్నేహితుడు ఆరిఫ్ (24)తో కలసి ద్విచక్ర వాహనంలో వలసపల్లి నుంచి మదనపల్లికి వస్తుండగా, బోయకొండ ఆర్చ్ వద్ద వాహనాన్ని అదుపు చేయలేక కిందపడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

- పిటిఎం మండలం పోతు పేట గ్రామానికి చెందిన పూజారి సి. రామప్ప (65) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎం. పార్ల పల్లె క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పూజారి రామప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బి కొత్తకోట ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
- సత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణం నాలుగో వార్డ్ కు చెందిన ముత్యాలు మరికొందరితో కలిసి గ్యాస్ ఐరన్ స్టవ్ లు రిపేరు చేసుకుంటూ సంచార జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లి పట్టణం టిప్పు సుల్తాన్ మైదానం సమీపంలో వీరు ఉంటున్నారు. మంగళవారం ఉదయం బి సుంకులు (12) అనే బాలిక, బి చందు (3) చిన్నారితో కలిసి టీ తీసుకుని రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో చందు తీవ్రంగా గాయపడగా సుంకులుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వం మారింది... మధ్యాహ్న భోజనం ఆగింది


మధ్యాహ్నం భోజనం ఆగిన అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాల

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం మారగానే రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలంలోని అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆగింది. అప్పలరాజుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఈనెల 13న పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. అదేరోజు నుంచి రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. అంతే.. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మధ్యాహ్న భోజనం వంట మనిషికి వంట చేయొద్దని చెప్పండి.. అంటూ పాఠశాలలోని ఉపాధ్యాయులకు గ్రామ స్థాయి అధికార పార్టీ నాయకుడు హుకుం జారీ చేశాడు. దీంతో నాలుగు రోజులుగా పాఠశాలలోని విద్యార్థులకు భోజనం కరువైంది. మధ్యాహ్నం వరకు పాఠశాలలో ఉంటూ ఇంటికి వెళ్లి భోజనం తిని రావాల్సిన దుస్థితి నెలకొంది. అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకులు తమ పార్టీకి చెందిన వారు వంట చేస్తారంటూ ఉపాధ్యాయులను ఆదేశించడంతో చేసేదేమీ లేక మిన్నకుండి పోయారు. ఈ విషయమై స్థానిక ఎంఈఓ చక్రనాయక్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

వామ్మో.. పురుగులు




ఇంటి ఆవరణలో పురుగులు, మంచాలు ఎక్కి ఇళ్లలోకి చొచ్చుకొస్తున్న బొచ్చుపురుగులు

- తాకితే దురద
- బెంబేలెత్తుతున్న ప్రజలు

రాయచోటి టౌన్ : వామ్మో ...ఇవేమి పురుగులో... బొచ్చు పురుగులు ఇళ్లలోకి వరుసపెట్టి వస్తున్నాయి. వాటిని పొరపాటున తాకితే విపరీతమైన దురద... మంట పుట్టిస్తున్నాయి. దీంతో ఇళ్లలోకి రానీయకుండా తలుపు బిగించినా సరే కిటికీలు, తలుపుల మధ్య భాగం నుంచి ఇళ్లలోకి ఆ పురుగులు వస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటిని పక్షులు కానీ కోళ్లు కానీ తినడం లేదు.

వీటిని తాకితే దరద భరించలేకపోతున్నాం



దుక్కులు కూడా చేయలేదు కానీ అప్పుడే పొలంలో నుంచి కుప్పలుతెప్పలుగా బయటకి వచ్చి ఇళ్లలోకి వస్తున్నాయి. వాటిని బయటికి తోసేసే క్రమంలో చేతికి పొరపాటున తాకితే మాత్రం దురద, మంట వస్తోంది. ఇళ్లలోకి రానీయకుండా చీపుర్లతో బయటికి తోసేసి చిత్తు పేపర్లతో కాల్చేస్తున్నాము. అయినా మళ్లీ పొలాల నుంచి గుంపులు గుంపులుగా వచ్చేస్తున్నాయి. రాత్రి నిద్రపోవాలన్నా భయంగా ఉంది. – రాంప్రసాద్, రైతు, రాయచోటి

వీటి వలన పంటలకు నష్టం ఉండకపోవచ్చు


ఈ పురుగుల వలన పంటలకు నష్టం జరగకపోవచ్చు. ఎందుకంటే పంట సాగు చేయలేదు కాబట్టి పంటలపై వెళ్లేందుకు అవకాశం ఉండదు. వీటి జీవిత కాలం రెండు వారాల నుంచి 20 రోజులు మాత్రమే. గతంలో ఇలాంటి పురుగులు మన ప్రాంతంలో కనిపించేవి కాదు. వీటిని నివారించడానికి పెరాథిన్ పౌడర్ కానీ గెమాసిన్ పౌడర్ ఉపయోగించాలి. ఇళ్లలోకి రాకుండా గడప వద్ద.. ఆవరణలో చల్లితే ఇళ్లలోకి రాకుండా వెళ్లిపోతాయి. – దివాకర్, ఏఓ, రాయచోటి

ట్రాక్టర్‌ను ఢీ కొన్న లారీ

– మహిళకు తీవ్ర గాయాలు

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని జాతీయ రహదారి పుల్లంగేరు బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు కాగా, వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే ..రైల్వేకోడూరు మండలం, రెడ్డివారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన జాను, పి. దస్తగిరి అనే దంపతులు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరు రాజంపేటకు మామిడి కాయలు కోయడానికి ట్రాక్టర్‌లో మరికొంతమంది కూలీలతో కలసి బయలుదేరారు. తిరుపతి నుంచి గిద్దలూరుకు వెళ్తున్న టీఎన్34ఎంఎస్7755 నంబరుగల లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేయబోయి ఢీ కొంది. దీంతో ట్రాక్టర్‌లోని కూలీలందరూ ఎగిరి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో జాను అనే మహిళకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా పుల్లంపేట పోలీసులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్‌ఐ రఘురాం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ వాహనాల వేలానికి స్పందన


ఎక్సైజ్ వాహనాల వేలం నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు వాల్మీకి

మదనపల్లె : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్(ఎస్ఈబీ) మదనపల్లె పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం నిర్వహించిన వేలంపాటలకు స్పందన లభించింది. వాహనాలు కొనుగోలు చేసేందుకు అధికసంఖ్యలో పోటీపడ్డారు. అన్నమయ్యజిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు వాల్మీకి సమక్షంలో, ఎస్ఈబీ సీఐ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణలో మొత్తం 59 వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించగా, 54 వాహనాలను ప్రజలు కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి ఎంవీఐ అధికారులు రూ.5లక్షల81వేలు ప్రభుత్వ ధరగా నిర్ణయిస్తే... వేలంపాటల్లో పోటీదారులు రూ.9లక్షల81వేలకు పాడుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్ణీత ధర కన్నా 66.87 శాతం అధికధరకు కొనుగోలు చేయడంతో ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరిందన్నారు. వేలం వాహనాలకు సంబంధించి కేసు నెంబర్, ఎంవీఐ అధికారులు నిర్ణయించిన ధరను ముందుగానే తెలపడం, వేలంపాటల్లో పాల్గొనేందుకు డిపాజిట్ మొత్తం రూ.5వేలుగా నిర్ణయించి, టోకెన్‌లు మంజూరుచేయడం, ధరావతు చెల్లించిన వారిని మాత్రమే వేలంపాటలు నిర్వహించే ప్రదేశంలో అనుమతించడంపై ఎస్ఈబీ సీఐ రమేష్‌రెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన తల్లి


తల్లిని కుమారుడు గురుశేఖర్‌కు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ బోయకుమార్

ధర్మవరం అర్బన్ : తప్పిపోయిన తల్లిని కుటుంబ సభ్యుల చెంతకు ధర్మవరం రైల్వే పోలీసులు చేర్చారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ బోయ కుమార్ తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా తాటిగుంటపాళ్యానికి చెందిన 60 ఏళ్ల రెడ్డమ్మ నాలుగేళ్ల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా రైలు ఎక్కి వెళ్లిపోయింది. ఘటనపై అప్పట్లో ఆమె కుమారుడు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఆమె ఫొటోతో కూడిన కరపత్రాలను రైల్వేస్టేషన్లు, బస్టాండ్ ప్రాంతాల్లో అతికించాడు. ఈ నెల 24న తిరుపతి – గుంతకల్లు ప్యాసింజర్ రైలులో తన తల్లి ప్రయాణిస్తున్నట్లు సమాచారం అందుకున్న గురుశేఖర్ వెంటనే రైల్వే పోలీసులను సంప్రదించాడు. రైలు ధర్మవరం స్టేషన్‌కు చేరుకోగానే బోగీలను ఆర్‌పీఎఫ్ ఎస్ఐ కుమార్, సిబ్బంది గాలించి రెడ్డమ్మను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విషయాన్ని గురుశేఖర్‌కు తెలపడంతో మంగళవారం ఆయన ధర్మవరానికి చేరుకోవడంతో ఆయనకు రెడ్డమ్మను అప్పగించారు.

వాంతులతో చిన్నారి మృతి

కడప రూరల్ : కడప నగరం రామరాజుపల్లెలో ఓ చిన్నారి వాంతులతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. రామరాజుపల్లెకు చెందిన చిన్నారి కీర్తి (6) ఉన్న ఫలంగా వాంతులతో మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. చిన్నారి తల్లిదండ్రులైన శ్రీనివాసరావు, నిర్మలాదేవిలతో ఆదివారం ఐటీఐ సర్కిల్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి సాయంత్రం రామరాజుపల్లెలోని స్వగృహానికి చేరుకున్నారు. తర్వాత కీర్తి మొదటగా ఒకసారి వాంతి చేసుకుంది. అనంతరం అర్ధరాత్రి సమయంలో, సోమవారం తెల్లవారుజామున వాంతులయ్యాయి. దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో కడప నగరంలో జరిగిన చిన్నారి మృతితో జిల్లా వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డీఎంహెచ్ఓ నాగరాజు తన బృందంతో రామరాజుపల్లెలో పర్యటించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. కొన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించగా ఎలాంటి పాజిటివ్ రిపోర్టు రాలేదు. డయేరియా అయితే మొదట విరేచనాలు అవుతాయి. అదే డెంగీ అయితే జ్వరం వస్తుంది. ఈ లక్షణాలు ఏమి కనిపించలేదని అధికారులు నిర్ధారించారు. చిన్నారి వాంతులైన 12–13 గంటల వ్యవధిలోనే మరణించింది. సీజనల్ వ్యాధుల కాలంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.